


# పురుషోత్తము చౌధరి

(సెప్టెంబర్ 5, 1803 - సెప్టెంబర్ 5, 2003)

# తెలుగు దావీదు

ఇశ్రాయేలీయులు దైవనామ సంకీర్తనము చేయుటకు పవిత్ర గ్రంథమైన బైబిల్ లోని కీర్తనల గ్రంథములో డెబ్బయికి పైగా దావీదు భక్తుడు రచించిన పాటలున్నాయి. తెలుగు క్రైస్తవులు దైవారాధనలో యేసు క్రీస్తు నామ సంకీర్తనము చేయుటకు ఆంధ్ర క్రైస్తవ కీర్తనలలో డెబ్బయికి పైగా పురుషోత్తము చౌధరి రచించి కీర్తించిన పాటలున్నాయి. ఇశ్రాయేలీయులకు దావీదు ఎంత ప్రియమైన చక్రవర్తియో, భక్తిరస గీతాలు పాడే తెలుగు విశ్వాసులకు కవి సామ్రాట్ పురుషోత్తము చౌధరి అంత ప్రియమైనవాడు. అంతేకాదు దావీదు భక్తుడు దేవునికి ఎంత హృదయానుసారుడో, అభిషిక్తుడైన చౌధరి గారు అంతగా ప్రభువును ఘనపరిచిన వాడు. పాప పరితాప్త హృదయములో,రక్షణ నిశ్చయతలో, దేవుని ఆశ్రయించుటలో శుభప్రధమైన నిరీక్షణలో మరెన్నో విశ్వాస లక్షణాలలో పురుషోత్తము చౌధరి-తెలుగు దావీదు అనడానికి "త్రాహి మాం క్రీస్తునాథ..." "ఉన్నపాటున వచ్చుచున్నాను" "యెహోవ నా మొఱ లాలించెను" "నీ చరణములే నమ్మితి నమ్మితి", "సకలేంద్రియములారా.." అనే పాటలు నిదర్శనాలు. వాటి వెనుక నున్న ఆధ్యాత్మిక అనుభవాలు దావీదును గుర్తుచేస్తాయి. అంతేకాదు హృదయ పరివర్తన చెందిన ప్రతిభక్తుడు తన స్వానుభవంగానే భావిస్తాడు. దావీదు కీర్తనలు ధ్యానిస్తే కలిగే అనుభూతి, పురుషోత్తము చౌధరిగారి పాటలు పాడుతున్నా దైవ ప్రేమతో తన్మయత్వం చెందుతాము. "దావీదు దేవుని సంకల్పము చొప్పున తన తరము వారికి సేవ చేసి" (అపొ॥కా॥ 13:36) పితరులతో చేర్చబడినా, తరతరాలకు తన పాట దీవెనయినట్లు, పురుషోత్తము చౌధరి కూడా తన తరానికే గాక తెలుగువారికి తరతరాలకు దీవెనగా నిలిచిపోయాడు. అందుకే పురుషోత్తము చౌధరి - తెలుగు దావీదు.

పురుషోత్తము చౌధరి 1803వ సంవత్సరము సెప్టెంబర్ 5వ తేది కూర్మనాథ చౌధరి- సుభద్రాదేవి చౌధారాణి దంపతులకు గంజాము జిల్లా తెంబూరు మర మధనపుర గ్రామములో జన్మించాడు. వీరి పితరులు మన ప్రాంతాలకు వలస వచ్చిన బెంగాలి బ్రాహ్మణులు. 'చౌధరి' అంటే నాలుగు గ్రామాలపై అధికారి అనేగాక, నాలుగు వేదాలలో ప్రవీణుడనే బిరుదుగా కూడా భావించేవారు. దైవచింతా తత్పరియైన తల్లిగారి ఆలనలో, సుప్రసిద్ధ అస్తానకవియైన తండ్రిగారి పాలనలో, యీ కుమారునికి ఉగ్గుపాలతోనే జపతపాలు, పూజ పునస్కారాలు, వైదిక ధర్మాలు, మతనిష్ఠలు, దైవ సంకీర్తనలు వచ్చాయి. ఏడవ యేటే సాంప్రదాయ సిద్ధంగా అక్షరాభ్యాసం, ఉపనయం చేసారు. మహాగొప్ప మత ప్రచారకుడు కావాలని మాతృమూర్తి హృదయాభిలాష. ఆ విధంగానే హైందవ ధర్మములో పెరిగి పెద్దవాడయ్యాడు. మేనమామగారైన రఘునాథపాల్ మహంతిగారి కుమార్తె రాధామణి దేవితో ఇరువదవ యేట వివాహం జరిగింది.

పురుషోత్తము చౌధరికి అన్ని వున్నా ఆత్మశాంతి లేదు. దైవాన్వేషణలో నిమగ్నమయ్యాడు. గురుశిశ్రూష చేసాడు. యోగాభ్యాసం, వేదాంత పారాయణం, యింకా ఎన్నెన్నో చేసినా ప్రయోజనం లేకపోయింది. చివరికి సువార్త కరపత్రం చదివి యేసు క్రీస్తే నిజదైవమని గ్రహించి 1833వ సంవత్సరం అక్టోబర్ 6వ తేది బహిరంగ సాక్ష్యంతో బాప్తీస్మమం పొందాడు. రక్షణానందములో పరవశము చెంది "మా యేసుక్రీస్తుని మఱుగు గల్గెనురా, నా యాత్మ ఘనరక్షా నగము నెక్కెనురా" అనే కీర్తన రచించాడు. ఇదే తెలుగులో వెలుబడిన తొలి క్రైస్తవ భక్తిగీతం. ఆ తదుపరి 130 అపురూపమైన భక్తిగీతాలతోపాటు మరెన్నో రచించాడు. 1890 ఆగష్టు 23వ తేది మధ్య రాత్రి కల్వరి గిరీశ ప్రభూ అంటూ పరమపదించాడు. క్రైస్తవలోకానికి అమరజీవిగా మిగిలిపోయాడు. ప్రతి విశ్వాసి గాత్రంలో వినిపిస్తాడు. విశ్వాసుల ధ్యానంలో నివసిస్తాడు. ప్రభువైన యేసు క్రీస్తు పునరాగమనము వరకు దైవారాధనలో పురుషోత్తము చౌధరి మన జ్ఞాపకంలో వుంటాడు. వీరి ద్విశత జయంతి వేడుకలు ఆడంబరాలతో ఆగిపోక అందరికి ఆశీర్వాదం కావాలని ఆశిస్తూ... కొందరికైన ప్రేరణ కావాలని దేవుణ్ణి ప్రార్థిస్తూ....మీ



రెవ॥ డా॥ జి. సామ్యేల్

(గౌరవసంపాదకులు)